సాక్షి కర్నూలు

శనివారం । 9 । నవంబర్ । 2024



భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబాదేవికి అర్చకులు శుక్రవారం ఊయలసేవ నిర్వహించారు. ముందుగా సేవా సంకల్పాన్ని పఠించి మహా గణపతి పూజ చేశారు.



అలరించిన సంప్రదాయ నృత్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై విజయవాడ పంచమవేద నృత్యాలయం వారి నృత్యం, కర్నూలు లక్ష్మీమహేష్ భాగవతార్ వారి హరికథాగానం అలరించాయి.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,631.97
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 101.656
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 9,051
అవుట్ ఫ్లో	: 10,047

న్యూస్‌రీల్

రోగులకు రేడియాలజీ విభాగం సేవలు కీలకం



రేడియోగ్రఫీ ఆవిష్కర్త రాంటిజెన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చే రోగులకు రేడియాలజీ విభాగం సేవలు కీలకమని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు అన్నారు. అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆసుపత్రిలోని రేడియాలజీ విభాగంలో ఉన్న శాస్త్రవేత్త రాంటిజెన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో ఒకప్పుడు ఎక్స్‌రే, స్కానింగ్ పరీక్షలు చేస్తే మరుసటి రోజు రిపోర్టులు వచ్చేవని, అలాంటి పరిస్థితికి ఇప్పుడు స్వస్తి పలికారన్నారు. రోగులకు ఇబ్బంది కలగకుండా ఎక్స్‌రే, స్కానింగ్ తీసిన ఒక గంటలోపే ఫిలిమ్స్, రిపోర్ట్స్ అందజేస్తుండటంతో త్వరగా చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. రేడియాలజీ విభాగానికి అత్యాధునిక టెక్నాలజీ గల యంత్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చిట్టినరసమ్మ, రేడియాలజీ హెచ్‌వోడీ డాక్టర్ రాధారాణి, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ హేమనళిని, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్, రేడియాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ హరినాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

18 నుంచి డిగ్రీ ప్రాక్టికల్ పరీక్షలు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఈ నెల 18వ తేదీ నుంచి డిగ్రీ 1వ, 3వ, 5వ సెమిస్టర్ ప్రాక్టికల్ పరీక్షలు, 29వ తేదీ నుంచి థియరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ ఆదేశాల మేరకు పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించామని పేర్కొన్నారు. పరీక్షల టైమ్ టేబుల్‌ను నిర్ణీత సమయంలో తెలియజేస్తామన్నారు.

పోలింగ్ బూత్‌ల్లో అవగాహన సదస్సులు

కర్నూలు(సెంట్రల్): ఎస్ఎస్ఆర్–2025 ముసాయిదాపై అభ్యంతరాలు, సలహాల స్వీకరణ కోసం శనివారం, ఆదివారం ప్రతి పోలింగ్ బూతుల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ రంజిత్‌బాషా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 20,59,700. ఇందులో పురుషులు 10,16,134 మంది, స్త్రీలు 10,43,254 మంది, ఇతరులు 312 మంది ఉన్నారు. జాబితాలోని ఓటర్లలో అనర్హులు ఉన్నా, మరణించిన వారి పేర్లు ఉన్నా, తప్పుడు సర్టిఫికెట్లు సమర్పించిన వారు ఉన్నా, పేర్లు, ఊర్లు, నియోజకవర్గాల మార్పులు తదితర మార్పులు చేసుకోవడానికి ఎన్నికల సంఘం అవకాశం ఇచ్చింది. ఈనెల 9, 10 తేదీల్లో ప్రతి పోలింగ్ బూత్‌లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తారు. బూత్‌లెవల్ అధికారులు హాజరై ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తారు.

సాగుకు రుణం.. ఎంతో దూరం!



ఖరీఫ్ ఊరించి ముంచేసింది. నష్టాలు మూటగట్టుకున్న రైతులు రబీలో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. అయితే ఓ వైపు ప్రభుత్వం నుంచి సాయం కరువైంది. అన్నదాత సుఖీభవా.. అంటూ పేరు మార్చి ప్రచారం చేసుకుందే తప్పా రైతులకు పైసా ఇవ్వలేదు. రుణాలు ఇచ్చి ఆదుకోవాల్సిన బ్యాంకులు సైతం రైతుల పట్ల చిన్నచూపు చూస్తున్నాయి. పంట రుణాలిచ్చేందుకు ససేమిరా అంటున్నాయి. మమ అన్నట్లు అరకొరగా ఇచ్చి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నాయి. రుణాలు అందక కొందరు రైతులు సాగుకు దూరమవుతుండగా, మరి కొందరు అధిక వడ్డీలకు అప్పులు చేసి భారంగా కాడి కదిలిస్తున్నారు.

- రబీ పంట రుణాల పంపిణీలో బ్యాంకర్ల నిర్లక్ష్యం
- లక్ష్యం రూ.1,997.16 కోట్లు
- 35 రోజుల్లో పంపిణీ రూ.125.72 కోట్లు మాత్రమే
- కౌలుదారులను పట్టించుకుంటే ఒట్టు

కర్నూలు(అగ్రికల్చర్): రబీ సీజన్ ప్రారంభమై రోజులు గడిచి పోతున్నాయి. రైతులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సాహం లేదు. సూపర్–6లో రైతులకు పెట్టుబడి సాయం కింద ఏటా రూ.20 వేలు చెల్లిస్తామని చెప్పి మొండిచేయి చూపింది. వ్యవసాయానికి పెట్టుబడికి బ్యాంకుల నుంచి తీసుకునే పంట రుణాలే ఆధారం. అయితే బ్యాంకులు నిబంధనలు, షరతులు విధిస్తూ ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ఏదో ఒక కారణం చూపి రుణాలు ఇవ్వడానికి నిరాకరిస్తున్నాయి. దీంతో అప్పుల బారిన పడి ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ఖరీఫ్‌లో వర్షాభావం, అధిక వర్షాల వల్ల పంటలు పూర్తిగా దెబ్బతినడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయారు. రబీ అయినా కలసి వస్తుందనే ఆశతో పంటలు సాగు చేద్దామన్నా బ్యాంకులు రుణాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం చూపుతున్నాయి. జిల్లాలో రబీ సీజన్ సాధారణ సాగు 1,17,288 హెక్టార్లు ఉండగా ఇప్పటి వరకు 25,126 హెక్టార్లలో పంటలు వేశారు. ప్రధానంగా శనగ 70 వేల హెక్టార్లలో సాగు చేసే అవకాశం ఉంది. రబీ పంటల సాగు చురుగ్గా సాగుతున్నా పంట రుణాల పంపిణీ దయనీయంగా ఉంది. రబీ పంట రుణాల పంపిణీ లక్ష్యం రూ.1997.16 కోట్లుగా నిర్ణయించారు. అయితే సీజన్ మొదలై 35 రోజులు గడిచినప్పటికీ లక్ష్యంలో కేవలం 6.29 శాతం కనిపిస్తోంది. ఇప్పటి వరకు రూ.125.72 కోట్లు మాత్రమే పంపిణీ చేశాయి. జిల్లాలో పలు బ్యాంకులు రబీ రైతులకు రుణాలు పంపిణీ చేసిన దాఖలాల్లేవు. వివిధ బ్యాంకుల్లో దళారీల హవా నడుస్తోంది. మేనేజర్లు, ఫీల్డ్ ఆఫీసర్లు దళారీలను పెట్టుకుని పంట రుణాల పంపిణీలో మామూళ్లు దండుకుంటున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. డోన్, ప్యాపిలి, బేతంచెర్ల, వెల్దుర్తి, కృష్ణగిరి, దేవనకొండ, పత్తికొండ, హాలహర్వి మండలాల్లోని ఎస్‌బీఐ, ఏపీజీబీ, యూనియన్ బ్యాంకు ల్లో దళారీలదే రాజ్యంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఖాళీగా ఉన్న ఎస్‌బీఐ బ్రాంచీ

రుణాల పంపిణీని వేగవంతం చేస్తాం..



రబీ సీజన్‌కు సంబంధించి పంట రుణాల పంపిణీని వేగవంతం చేస్తున్నాం. అక్టోబరు 1 నుంచి రబీ మొదలైంది. పంట రుణాల పంపిణీ లక్ష్యం రూ.1997.16 కోట్లు ఉంది. బ్యాంకులు ఇప్పటి వరకు రూ.125 కోట్లు పంపిణీ చేశాయి. రానున్న రోజుల్లో పంట రుణాల పంపిణీ కార్యక్రమాన్ని అన్ని బ్యాంకులు వేగవంతం చేయనున్నాయి. లక్ష్యం మేరకు రుణాలు పంపిణీ చేసే విధంగా అన్ని బ్యాంకులకు సూచనలు ఇచ్చాం.

– రామచంద్రరావు, ఎల్‌డీఎం, కర్నూలు

సీసీఆర్ కార్డుతో ప్రయోజనం శూన్యం



మాకు సొంత భూమి లేదు. భూములు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసుకుంటూ ఉపాధి పొందుతున్నాం. కౌలుదారులకు ఎటువంటి ప్రోత్సాహం లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. మేము 2024–25 సంవత్సరానికి సంబంధించి 312–3 సర్వే నెంబరులోని 3.32 ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నాం. సీసీఆర్ కార్డు కూడా ఇచ్చారు. ఆ కార్డుద్వారా ఎలాంటి ప్రయోజనం లభించలేదు. ఆ కార్డులపై కనీసం ఎరువులు ఇవ్వడం లేదు. బ్యాంకర్లు అస్సలు సీసీఆర్ కార్డులను పట్టించుకోవడం లేదు. సాగుదారుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– బి.నాగరాజు, సల్కాపురం, కల్లూరు మండలం

బ్యాంకర్లు పట్టించుకోవడం లేదు



ప్రభుత్వం జారీ చేసిన సీసీఆర్ కార్డులను బ్యాంకులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. మాకు సొంత భూమి లేదు. రైతుల నుంచి కౌలుకు తీసుకొని వ్యవసాయం సాగు చేస్తున్నాం. ఈ ఏడాది గ్రామంలోనే నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నాం. 11 నెలల కాలపరిమితికి ప్రభుత్వం సీసీఆర్ కార్డు జారీ చేసింది. ఈ కార్డు వల్ల ఎలాంటి లబ్ధి చేకూరలేదు. బ్యాంకు రుణం కోసం ప్రయత్నించినప్పటికీ పట్టించుకోవడం లేదు. రుణం సకాలంలో చెల్లిస్తామని హామీ ఇచ్చినప్పటికీ బ్యాంకు అధికారులు ఇవ్వడం లేదు. కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– బి.అర్జున్, బస్తిపాడు, కల్లూరు మండలం

ఇన్‌పుట్ సబ్సిడీ ఊసే లేదు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అధిక వర్షాల వల్ల పంటలు దెబ్బతింటే నెల రోజుల్లోనే ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల అయ్యేది. కరువు ఏర్పడినప్పుడు వ్యవసాయ సీజన్ ముగిసేలోగా పరిహారం రైతులకు అందేది. 2023–24 రబీ సీజన్‌లో ఏర్పడిన కరువుకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల ఎప్పుడనేది ప్రశ్నార్థకంగా మారింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే కేంద్ర బృందం వచ్చి ఇటు కర్నూలు, అటు నంద్యాల జిల్లాల్లో పర్యటించింది. అయితే ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల ఎప్పుడనేది సమాధానం లేని ప్రశ్న. రబీలో కర్నూలు జిల్లాలో 33 శాతం ఆపైన అనావృష్టి వల్ల 57,677.62 హెక్టార్లలో పంటలు దెబ్బతినగా.. ఇన్‌పుట్ సబ్సిడీ కోసం ఇన్‌పుట్ సబ్సిడీ రూ.58.28 కోట్లు విడుదల కావాల్సి ఉంది. దీనిపై ప్రభుత్వం ఇంత వరకు దృష్టి సారించిన దాఖలాలు లేవు.

22 మంది కౌలుదారులకు మాత్రమే..

2019–20 నుంచి 2023–24 వరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కౌలుదారుల సంక్షేమానికి పెద్దపీట వేసింది. సాగుదారుల అభ్యున్నతి లక్ష్యంగా 2019లో ఇటు భూ యజమాని హక్కులకు భంగం వాటిల్లకుండా.. కౌలుదారుల అభ్యున్నతి లక్ష్యంగా నూతన కౌలుదారు చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టం ద్వారా అర్హులైన సాగుదారులకు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేస్తోంది. వాటిని పొందిన రైతులకు వైఎస్ఆర్ రైతుభరోసా, ఉచిత పంటల బీమా వంటి సదుపాయాలు కల్పించింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సాగుదారుల సంక్షేమానికి తూట్లు పొడుస్తోంది. రైతులకు అండగా నిలుస్తున్న 2019 కౌలుదారుచట్టాన్ని పక్కన పెట్టి కొత్త చట్టాన్ని తీసుకురావడానికి రంగం సిద్ధం చేసింది. ఈ నెల 11 నుంచి జరిగే శాసనసభ సమావేశాల్లో చట్టాన్ని ఆమోదించనున్నట్లు తెలుస్తోంది. 2014– 19 వరకు ఉన్న టీడీపీ ప్రభుత్వం రుణ అర్హత కార్డులు పంపిణీ చేసింది. వీటిని బ్యాంకులు పట్టించుకోలేదు. సంక్షేమ పథకాలు అందలేదు. 2024–25లో సీసీఆర్‌సీ కార్డులు 11 నెలల కాలపరిమితితో 23,005 జారీ అయ్యాయి. అత్యధికంగా ఎమ్మిగనూరు, ఆదోని, మంత్రాలయం, కౌతాళం, పెద్దకడబూరు, గూడూరు, హొళగుంద, మద్దికెర, తుగ్గలి, నందవరం మండలాల్లో సీసీఆర్‌సీ కార్డులు జారీ అయ్యాయి. కాని ఇప్పటి వరకు కౌలుదారులకు రుణాలు ఇచ్చింది 22 మందికి మాత్రమే. ఈ సంఖ్యను బట్టి చూస్తే బ్యాంకులు వీటిని పరిగణలోకి తీసుకోవడం లేదనే విషయం స్పష్టమవుతోంది.

చట్టాలపై అందరూ పరిజ్ఞానం పెంచుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి లీలా వెంకట శేషాద్రి

కర్నూలు కల్చరల్: ప్రజలు ప్రతి ఒక్కరూ చట్టాల పట్ల పరిజ్ఞానం పెంపొందించుకోవాలని జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి బి. లీలా వెంకట శేషాద్రి అన్నారు. జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా శుక్రవారం వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో న్యాయ అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన న్యాయ పరిజ్ఞానం ఉన్నప్పుడే సమాజంలోని అన్యాయాన్ని ఎదిరించగలమన్నారు. శాశ్వత లోక్ అదాలత్‌లలో సివిల్ క్రిమినల్ కేసులు ఏవైనా వేసుకోవచ్చన్నారు. సరైన ఆర్థిక స్థోమత లేనివారు తమను సంప్రదిస్తే ఉచితంగా న్యాయ సహాయం అందించే ఏర్పాటు చేస్తామన్నారు. వర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ మాట్లాడుతూ దేశంలోని ప్రజలందరికీ సమన్యాయం అందాలన్నదే జాతీయ న్యాయ సేవా సంస్థ ఏర్పాటు చేయడం ప్రధాన ఉద్దేశమన్నారు. మహిళలు, అణగారిన వర్గాలకు అందే ఉచిత న్యాయ సేవలపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్‌నాయుడు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి.వి. కృష్ణారెడ్డి, ఆర్‌యూసీఈ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిప్రసాద్ రెడ్డి, విశ్రాంత న్యాయ మూర్తి కర్నూలు లోక్ అదాలత్ చైర్మన్ ఎం. వెంకట హరినాథ్, ఆర్‌యూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ నాగరాజు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌తో స్క్రీనింగ్ టెస్ట్ వాయిదా

కర్నూలు(అర్బన్): రాష్ట్రంలోని తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మోడల్ ఎన్నికల కోడ్ నియమావళి మేరకు ఈ నెల 10వ తేదీన నిర్వహించాల్సిన మెగా డీఎస్సీ కోచింగ్ ఎంట్రెన్స్ టెస్ట్‌ను వాయిదా వేస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ జేడీ జే రంగలక్ష్మీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి తమ శాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. తిరిగి స్క్రీనింగ్ టెస్ట్‌ను ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే తెలియజేస్తామన్నారు.

పంచాయతీల సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి

- డీపీఆర్‌సీ వైస్ ప్రిన్సిపాల్, డీపీఓ భాస్కర్

కర్నూలు(అర్బన్): జిల్లాలోని గ్రామ పంచాయతీల సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహిస్తున్న వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులందరూ కృషి చేయాల్సిన ఆవశ్యకత ఉందని జిల్లా పంచాయతీ అధికారి, డీపీఆర్‌సీ వైస్ ప్రిన్సిపాల్ జీ భాస్కర్ అన్నారు. ఈ నెల 5వ తేదీ నుంచి ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన ఎంపీడీఓ, ఈఓఆర్‌డీ, ఎంపిక చేసిన పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు స్థానిక జెడ్పీ ప్రాంగణంలోని డీపీఆర్‌సీ భవనంలో నాలుగు రోజుల పాటు బ్యాచ్‌ల ప్రకారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ప్రధానంగా 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనకు సంబంధించి మాస్టర్ ట్రైనర్స్ అవగాహన కల్పించారు. శుక్రవారం జరిగిన ముగింపు కార్యక్రమానికి హాజరైన డీపీఓ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం అనుసరించి జిల్లా, మండల, గ్రామ పంచాయతీల సొంత ఆదాయ వనరుల కేటాయింపు, 15వ ఆర్థిక సంఘం నిధులు వెచ్చించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీపీఆర్‌సీ ట్రైనింగ్ మేనేజర్ గిడ్డేష్, ఎంటీలు మధుసూదన్‌రెడ్డి, ప్రవీణ్ కుమార్, బాలకృష్ణుడు, వరప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్ఎస్‌జీ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం

- జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాషా



డ్వాక్రా బజార్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(అర్బన్): జిల్లాలోని స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు పెద్ద ఎత్తున మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని జిల్లా కలెక్టర్ పీ రంజిత్‌బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక సీ క్యాంప్‌లో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్, జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలోని డ్వాక్రా బజార్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహిళా మార్ట్‌లో విక్రయాలను చేస్తున్న వస్తువులను పరిశీలించారు. ఎంత మేర విక్రయాలు జరుగుతున్నాయని మహిళలను అడిగి తెలుసుకొని, మార్ట్‌ను మరింత అభివృద్ధి చేయాలన్నారు. ఈ నేపథ్యంలోనే మార్ట్‌లో విక్రయిస్తున్న డోర్ మ్యాట్స్, జీన్స్ ప్యాంట్స్, ఇతర ఉత్పత్తులను పరిశీలించారు. అలాగే జీన్స్ ప్యాంట్స్ తయారీ గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో స్వయం సహాయక సంఘాలు తయారు చేసే అన్ని ఉత్పత్తులతో డ్వాక్రా బజార్‌ను మరింత అభివృద్ధి చేయాలని ఆయన సూచించారు. అనంతరం స్థానిక టెలికాం నగర్‌లో పొదుపు మహిళ కృష్ణవేణి సొంతంగా నిర్వహిస్తున్న డోర్, బాత్రూమ్ మ్యాట్ల వ్యాపారాన్ని కలెక్టర్ పరిశీలించారు. 17 మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉపాధి కల్పిస్తున్న ఆమెను కలెక్టర్ అభినందించారు. కలెక్టర్ వెంట అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్‌డీఏ పీడీ నాగశివలీల తదితరులు ఉన్నారు.




బెల్ట్ కంపు రోడ్డెక్కింది!

కూటమి ప్రభుత్వంలో ఊరూరా బెల్ట్ షాప్‌లు కంపు కొడుతుందని చెప్పడానికి ఇదే నిదర్శనం. బెల్ట్ షాప్‌లను తొలగించాలని కూటమి నేతలే రోడ్డెక్కారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది. పవిత్ర పుణ్యక్షేత్రంలో బెల్ట్‌షాప్‌లు ఉన్నాయని తెలుగు తమ్ముళ్లు ధర్నాకు దిగడంతో ప్రజలు ముక్కున వేలేసుకున్నారు. టీడీపీలోనే మరో వర్గం నాయకులు బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్నారని ఏకంగా కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి వర్గీయులు శుక్రవారం మంత్రాలయం మండల కేంద్రంలో ఆందోళన చేపట్టారు. స్థానిక పన్నగహోటల్ వద్ద నుంచి టీడీపీ మండలాధ్యక్షులు పన్నగ వెంకటేశ్‌స్వామి ఆధ్వర్యంలో రాఘవేంద్ర సర్కిల్ మీదుగా టీడీపీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. రాఘవేంద్రసర్కిల్‌లో ధర్నాకు దిగారు. టీడీపీ నాయకులు ధర్నాకు దిగడం హాస్యాస్పదంగా ఉందని స్థానికులు చర్చించుకున్నారు. – మంత్రాలయం

పాలన పట్టు తప్పి .. ప్రగతి నిలిచి!

- రెగ్యులర్ ఈఓ లేక శ్రీశైల దేవస్థానంలో గాడి తప్పిన పాలన
- కార్యరూపం దాల్చని మాస్టర్‌ప్లాన్
- రూ.125 కోట్ల అభివృద్ధి పనులకు లభించని మోక్షం
- దేవస్థానానికి దక్కని భూములు
- నేడు శ్రీశైలానికి రానున్న సీఎం



శ్రీశైలంటెంపుల్: రాష్ట్రంలోనే అతిపెద్ద పుణ్యక్షేత్రాల్లో శ్రీశైలం ఒకటి. అలాంటి ఈ క్షేత్రానికి ప్రస్తుతం కార్యనిర్వహణాధికారి లేరు. టీటీడీ తరహాలో ట్రస్ట్‌బోర్డు లేదు. స్వయం ప్రతిపత్తి కార్యరూపం దాల్చలేదు. మాస్టర్ ప్లాన్ అమలుకు నోచుకోలేదు. ఇలా అనేక సమస్యలతో సతమతమవుతున్న శ్రీశైల దేవస్థానానికి దర్శనం కోసం నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వస్తున్నారు. ఈ నేపథ్యంలో పై అంశాలతో పాటు, క్షేత్ర అభివృద్ధిపై దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు. గతంలో శ్రీశైల దేవస్థాన ఈఓగా విధులు నిర్వహించిన డి.పెద్దిరాజును బదిలీ చేసి ఇన్‌చార్జ్ కార్యనిర్వహణాధికారిగా దేవస్థాన సహాయ కమిషనర్ ఈ.చంద్రశేఖరరెడ్డికి బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే క్షేత్రంలో డిప్యూటీ కార్యనిర్వహణాధికారి (డిప్యూటీ కమిషనర్) ఉన్నప్పటికి నిబంధనలకు విరుద్ధంగా కూటమి ప్రభుత్వం సహాయ కమిషనర్ (ఏసీ)కి ఇన్‌చార్జ్ ఈఓ బాధ్యతలు అప్పగించడంపై అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇన్‌చార్జ్ ఈఓ అంటే రెండు రోజులో మూడు రోజులో ఉంటారు. కానీ శ్రీశైలంలో మాత్రం 20 రోజులకు పైగా ఆయనే కొనసాగుతున్నారు. సాధారణంగా ఆధ్యాత్మిక భావన కలిగిన ఐఏఎస్ స్థాయి అధికారి ఈఓగా ఉండాలి.

మాస్టర్ ప్లాన్ సాగేనా..

శ్రీశైల మహాక్షేత్రంలో రాబోయే 50 సంవత్సరాలను దృష్టిలో ఉంచుకుని భక్తుల రద్దీని అంచనా వేసి అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నారు. తర్వాత దీనిని త్వరితగతిన అమలు చేసేందుకు అనుమతులు ఇవ్వాల్సిన అవసరం ఉంది. రాజకీయాల ఒత్తిళ్లకు లొంగకుండా క్షేత్రాభివృద్ధే ధ్యేయంగా నిర్ణయాలు తీసుకోవాలి. అలా పనిచేయాలంటే ఈఓకు విశేష అధికారాలు అవసరం. ఐఏఎస్ అధికారిని ఆ హోదాలో నియమించి కమిషనర్ స్థాయి అధికారాలు అప్పగిస్తే క్షేత్రంలో మాస్టర్ ప్లాన్ సజావుగా అమలుకు ఆస్కారముంటుంది.

రూ.125 కోట్ల పనులకు మోక్షమెన్నడో?

శ్రీశైల దేవస్థానంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గతేడాది డిసెంబరు నెలలో రూ.125 కోట్లతో క్యూ కాంప్లెక్స్, సాలు మండపాలు, సోలార్ పవర్ ప్లాంట్, క్షేత్ర భూములకు సరిహద్దు, దోర్నాల వద్ద కల్యాణమండపం, షాపింగ్ కాంప్లెక్స్, కర్నూలు వద్ద కల్యాణమండపం, తాగునీటి కోసం ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం, 200 గదుల వసతి సముదాయం, శివసేవకుల వసతి సముదాయం తదితర పనులకు శంకుస్థాపన చేసింది. తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆయా పనులకు మోక్షం లభించలేదు.

ఆ భూముల దేవస్థానానికి దక్కేనా?

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాత రికార్డులను పరిశీలించి, దేవదాయ, రెవెన్యూ, అటవీశాఖ మంత్రులు, ఉన్నతాధికారులతో హైపవర్ కమిటీ ఏర్పాటు చేసి సుమారు 4,500 ఎకరాల భూమి శ్రీశైల క్షేత్రానికి చెందినదిగా గుర్తించింది. ల్యాండ్ అండ్ సర్వే అధికారులు సరిహద్దులను సైతం గుర్తించారు. అటవీశాఖ నుంచి ఎటువంటి అడ్డంకులు లేకుండా దేవస్థాన భూములను తిరిగి దేవస్థానానికి దక్కేలా తీర్మానాలు చేసి అగ్రిమెంట్ సైతం చేసుకున్నారు. అయితే కేంద్ర అటవీశాఖ అధికారులు భూమిని బదిలీ చేసేది లేదని తిరస్కరించినట్లు సమాచారం. అటవీశాఖ అధికారులతో సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేసి క్షేత్ర భూమి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

ఊసేలేని స్వయం ప్రతిపత్తి

శ్రీశైల క్షేత్రానికి రోజు రోజుకు భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఈ రద్దీకి అనుగుణంగా క్షేత్రంలో సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. రాష్ట్రంలో రెండో అతిపెద్ద పుణ్యక్షేత్రం కావడంతో శ్రీశైల క్షేత్రానికి తిరుమల తరహాలో స్వయం ప్రతిపత్తి కల్పించాల్సి ఉంది. దీని వల్ల ప్రభుత్వానికి ఏటా చెల్లించే కామన్ గుడ్ ఫండ్ నుంచి మినహాయింపు వస్తుంది. ఆ ఫండ్‌ను మల్లన్న భక్తుల అవసరాలకే వినియోగించుకోవచ్చు.

ధర్మకర్తల మండలి నియామకం ఎప్పుడో?

ఇటీవల కూటమి ప్రభుత్వం తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ బోర్డును నియమించింది. శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి బోర్డును ఏర్పాటు చేయలేదు. ఈ బోర్డులో చైర్మన్ తో పాటు, 14మంది సభ్యులు ఉంటారు. వీరి నియామకం ఎప్పుడు ఉంటుందో ఇప్పటి వరకు స్పష్టత లేదు.

మరి కొన్ని సమస్యలు

- ప్రముఖ శ్రీశైల క్షేత్రానికి పటిష్ట భద్రత లేదు. క్షేత్ర భద్రత పర్యవేక్షించే చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌ను ఇంత వరకు సర్కారు నియమించలేదు. సీఎస్‌వో అధికారి నియామకానికి టెండర్లు పిలిచి జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో రిటైర్డ్ డీఎస్పీ స్థాయి అధికారిని ఎంపిక చేశారు. కానీ వేతనం విషయంలో సయోధ్య కుదరక ఇంకా జాయిన్ కాలేదు.
- శ్రీశైలక్షేత్రంలో విజిలెన్స్ డిపార్ట్‌మెంట్ లేకపోవడంతో అనేక అవినీతి, అక్రమాలకు అధికారులు పాల్పడుతున్నారు. గతంలో సుమారు రూ.2 కోట్లకు పైగా టికెట్ల కుంభకోణం, పెట్రోల్ బంక్ కుంభకోణం, టికెట్ల రీసైక్లింగ్ తదితర అక్రమాలు జరిగాయి.
- శ్రీశైల దేవస్థానంలో పడితరంకు సరఫరా చేసే నిత్యావసర సరుకుల నాణ్యతను పరిశీలించేందుకు ల్యాబ్ ఉండాలి. ఇది లేకపోవడంతో సదరు కాంట్రాక్టర్ నాణ్యత లేని వస్తువులను సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

అర్జీల మ్యాపింగ్‌పై అవగాహన

కర్నూలు(సెంట్రల్): పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్)కు వచ్చే అర్జీలను రిజిస్ట్రేషన్ చేసి మ్యాపింగ్ చేయడంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి సి.వెంకటనారాయణమ్మ కంప్యూటర్ ఆపరేటర్లకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో.. పీజీఆర్ఎస్ వచ్చే అర్జీలను తప్పులు లేకుండా ఎలా రిజిస్ట్రేషన్ చేయాలి? ఎలా మ్యాపింగ్ చేయాలన్న అంశంపై కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అర్జీలను రిజిస్ట్రేషన్ చేసి సంబంధిత శాఖకు మ్యాపింగ్ చేయాలన్నారు. కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగప్రసన్న లక్ష్మీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.

శ్రీశైలంలో 180 టీఎంసీలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 179.8995 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూరాల, సుంకేసుల నుంచి 9,572 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుంది. గురువారం నుంచి శుక్రవారం వరకు ఎగువ ప్రాజెక్టుల నుంచి 17,545 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది.

క్లుప్తంగా

ఓఆర్‌గా ఎస్.బాబుసాహెబ్

కర్నూలు (లీగల్): కర్నూలు జిల్లా అఫీషియల్ రిసీవర్‌గా స్థానిక న్యాయవాది ఎస్.బాబుసాహెబ్ నియమితులయ్యారు. రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వుల మేరకు కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ది ఈయన్ను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు బాబుసాహెబ్ శుక్రవారం కర్నూలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జ్యోత్స్నదేవిని కలిసి తన నియామక పత్రాలను అందజేసి ఓఆర్‌గా బాధ్యతలు స్వీకరించారు. జిల్లావ్యాప్తంగా దాఖలైన ఐపీ కేసులలో ఆస్తులకు సంబంధించిన వ్యవహారాలను ఈయన పర్యవేక్షిస్తారు. ఈయన గత 18 సంవత్సరాలుగా న్యాయవాదిగా పనిచేస్తూ స్థానిక బార్ అసోసియేషన్‌లో పలు పదవులను నిర్వహించారు. ఈయన నియామకం పట్ల పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్‌యూసీఈ బీటెక్ ఫలితాలు విడుదల


కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌కు సంబధించి గత జూలైలో జరిగిన బీటెక్ రెగ్యులర్ 2వ, 4వ, 6వ సెమిస్టర్, బీటెక్ సప్లిమెంటరీ 1 నుంచి 7వ సెమిస్టర్ వరకు పరీక్షల ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు. వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ ఆదేశాల మేరకు ఫలితాలను విడుదల చేసినట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ అధికారులు పేర్కొన్నారు. ఫలితాల కోసం http://rayalaseemauniversity.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు. బీటెక్ రెగ్యులర్ 2వ సెమిస్టర్ పరీక్షల్లో 169 మందికిగాను 19, 4వ సెమిస్టర్‌లో 163 మందికిగాను 94, 6వ సెమిస్టర్‌లో 158 మందికిగాను 135 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు.
బీటెక్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి 1వ సెమిస్టర్‌లో 213 మందికిగాను 94, 2వ సెమిస్టర్‌లో 82 మందికి 30, 3వ సెమిస్టర్‌లో 144 మందికిగాను 34, 4వ సెమిస్టర్‌లో 32 మందికిగాను 12, 5వ సెమిస్టర్‌లో 39 మందికిగాను 15, 6వ సెమిస్టర్‌లో 17 మందికిగాను 8, 7వ సెమిస్టర్‌లో 43 మందికిగాను 27 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు వెల్లడించారు.


అద్భుత గుహలు.. అపురూప శిలాకృతులు

- నంద్యాల జిల్లాకే తలమానికంగా వాల్మీకి, బిల్ల సర్గం గుహలు
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చొరవతో పర్యాటక రంగానికి కొత్త ఊపు
- పురాతన ఆలయాల అభివృద్ధి


వాల్మీకి గుహల ముఖ ద్వారం


ఎర్రజ్వాల గుహల వద్ద పర్యాటకులను అమితంగా ఆకర్షిస్తున్న ప్రాంతం


సహజసిద్ధంగా ఆకర్షణీయంగా ఏర్పడిన శిలాకృతులు


వాల్మీకి గుహ లోపలికి వెళ్లేందుకు దారి

డోన్: పర్యాటక ఖిల్లాగా విరాజిల్లుతున్న నంద్యాల జిల్లాలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక చొరవతో మరో రెండు పర్యాటక ప్రాంతాలు ప్రజలకు కనువిందు చేస్తున్నాయి. ఇప్పటికే ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బెలుం గుహలు జిల్లాలో ఉండటం ఒక విశేషమైతే, అంతకుమించి అందాలు సంతరించుకున్న ప్యాపిలి మండలం వాల్మీకి గుహలు, బేతంచెర్ల మండలం బిల్ల సర్గం గుహలు పర్యాటకులకు అమితానందం పంచుతున్నాయి.

పర్యాటక రంగంలో అగ్రగామి డోన్

రాష్ట్రంలో మోడల్ నియోజకవర్గంగా డోన్‌ను ఎంపిక చేసి కోట్లాది రూపాయల వ్యయంతో ప్రసిద్ధ పుణ్య క్షేత్రాలైన శ్రీ మద్దిలేటి స్వామి, గుండాల చెన్నకేశవ స్వామి, ముచ్చట్ల మల్లికార్జున స్వామి, కంబగిరి స్వామి ఆలయాల జీర్ణోద్ధరణను చేపట్టి పూర్తి చేశారు. అప్పటి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి చొరవతో నియోజకవర్గంలో వాల్మీకి, బిల్ల సర్గం గుహలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు డోన్ మండలం వెంకటాపురం చెరువు, ప్యాపిలి మండలం వెంగలాంపల్లె చెరువుల్లో బోటు షికారు కేంద్రాలు, రెస్టారెంట్లను ఏర్పాటుచేశారు. వీటి నిర్మాణం కోసం గత ప్రభుత్వం సుమారు రూ.6 కోట్లను వెచ్చించింది. ఈ నిధులతో పర్యాటకులను ఆకర్షించేలా ఏర్పాట్లు చేయడంతో పాటు అనేక సౌకర్యాలు కల్పించారు.

ఇలా వెళ్లాలి

నియోజకవర్గంలోని బేతంచెర్ల మండల కేంద్రం నుంచి 3.5 కిలోమీటర్ల దూరంలో కనుమకింది కొట్టాల గ్రామ సమీపంలో 20 ఎకరాలలో బిల్ల సర్గం గుహలు ఏర్పడ్డాయి. సహజసిద్ధమైన అందాలతో అబ్బురపరిచే శిలాకృతుల్లో ఏర్పడిన ఈ గుహలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ప్యాపిలి మండల కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉసేనాపురం, నల్లమేకలపల్లి మీదుగా బోయ వాండ్లపల్లె గ్రామ సమీపంలో 30 ఎకరాల విస్తీర్ణంలో వాల్మీకి గుహలు ప్రకృతి సిద్ధంగా ఏర్పడ్డాయి. రామాయణ మహాకావ్య సృష్టికర్త మహర్షి వాల్మీకి ఈ గుహలో తపస్సు చేశారని ఇక్కడి ప్రజలు ప్రగాఢంగా విశ్వసిస్తారు. ఇప్పటికే జిల్లాలోని శ్రీశైలం, మహానంది, అహోబిలం, యాగంటి క్షేత్రాలతో పాటు రాక్ గార్డెన్స్, బెలుం గుహలు, నల్లమల ఎకో పార్కులు పర్యాటకులను ఆనందడోలికల్లో ముంచెత్తుతుండగా గత ప్రభుత్వ హయాంలో ఈ గుహలు సైతం పర్యాటక జాబితాలో చేరాయి. ఈ రెండు గుహల అంతర్భాగంలో పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునే రీతిలో సహజసిద్ధంగా ఏర్పడిన అందాలను లైటింగ్‌తో మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. పర్యాటకుల కోసం క్యాంటీన్లను ఏర్పాటు చేశారు. చిన్నారులు ఆడుకునేందుకు ఆటస్థలాలు, పార్కులు, పర్యాటకులు సేద తీరేందుకు విడిది కేంద్రాలను కూడా ఏర్పాటు చేశారు. అద్భుతమైన ఈ గుహలు నంద్యాల జిల్లాకు మరింత గుర్తింపు తెస్తాయని పర్యాటక శాఖ అధికారులు భావిస్తున్నారు.

రెండు గుహలు..రూ.3కోట్లు

ఏళ్ల తరబడి పాలకుల నిర్లక్ష్యానికి ప్రతీకగా ఎలాంటి ఆదరణకు నోచుకోని గుహల అభివృద్ధిపై గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. వాల్మీకి, ఎర్రజ్వాల గుహల అభివృద్ధికి ఆర్థిక శాఖ మంత్రి మాజీ బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపారు. గుహలను తీర్చిదిద్ది పర్యాటకులను ఆకర్షించేలా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో అప్పటి ప్రభుత్వం రూ.3 కోట్ల నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టి పర్యాటకులకు అందుబాటులోకి తేవడంతో ఈ రెండు గుహల్లో నిక్షిప్తమైన అందాలు వెలుగులోకి వచ్చాయి.


గుహల అందాలను వీక్షిస్తున్న మాజీ మంత్రి బుగ్గన (ఫైల్)

జిల్లాకు మంచి గుర్తింపు



పర్యాటక రంగ అభివృద్ధిలో భాగంగా రెండు అద్భుతమైన గుహలు నంద్యాల జిల్లాకు మరింత గుర్తింపు తేనున్నాయి. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ అభివృద్ధి నభూతో నభవిష్యత్ అనే రీతిలో ఆదర్శంగా తీర్చిదిద్దారు.
– చిన్నకేశవయ్యగౌడ్, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్

ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయి



సహజసిద్ధంగా ఏర్పడిన గుహలు అందులోని శిల్పకళా సంపదను వెలుగులోకి తెచ్చి సంరక్షించడం శుభపరిణామం. నియోజకవర్గం పర్యాటకంగా అభివృద్ధి చెందడంతో ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడ్డాయి. ప్రాచీన దేవాలయాలకు పూర్వ వైభవం తీసుకురావడంలో గత ప్రభుత్వం చేసిన కృషిని ఈ ప్రాంతం ప్రజలు ఎన్నటికీ మరువలేరు.
– లక్ష్మీదేవి, గృహిణి, వెంకటాపురం, డోన్ మండలం

యాత్రికులను ఆకర్షించేలా సౌకర్యాలు



అన్నివర్గాల ప్రజలను ఆకర్షించే విధంగా ఇక్కడి గుహల వద్ద ఏర్పాట్లు జరిగాయి. అత్యంత సుందరంగా, ఆకర్షణీయంగా ఎక్కడా లేని విధంగా గుహల్లో సహజసిద్ధ చిత్రాలు పర్యాటకులను మంత్రముగ్ధులను చేసేలా ఉన్నాయి. ఈ గుహల గురించి, డోన్ పర్యాటక రంగం గురించి విస్తృత ప్రచారం చేసినట్లయితే పర్యాటకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.
– గుమ్మగాళ్ల రాజు, సర్పంచ్, ఆర్‌ఎస్ రంగాపురం. బేతంచెర్ల మండలం.

నగరంలో అఘోరీ

కర్నూలు కల్చరల్: కర్నూలు నగరంలో శుక్రవారం నాగసాధు అఘోరీ హల్‌చల్ చేశారు. నంద్యాల నుంచి కర్నూలుకు వస్తున్న ఆమె కారు చెడిపోవడంతో నగర శివారులోని ఓ షోరూంలో రిపేరీకి ఇచ్చారు. అక్కడి నుంచి జాతీయ రహదారిపై డోన్‌వైపు నాగసాధు నడుచుకుంటూ వెళ్లారు. ఒంటిపై దుస్తులు లేకుండా విభూతి రాసుకొని, రుద్రాక్షమాలలు ధరించి కలిన దకన వెళుతున్న ఆమెను వాహనదారులు ఆసక్తిగా చూశారు. పాదచారులు అఘోరీకి పాద నమస్కారాలు చేశారు. మరికొందరు సాధువును అనుసరిస్తూ పాదయాత్రగా వెళ్లారు.


అఘోరీ నాగసాధును అనుసరిస్తున్న ప్రజలు

20 మంది సీఐలకు స్థానచలనం

- వీఆర్‌లో ఉన్న ఐదుగురు సీఐలకు స్టేషన్లు కేటాయింపు
- ఉత్తర్వులు జారీ చేసిన కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్

కర్నూలు (టౌన్): రాయలసీమ జిల్లాల్లో పనిచేస్తున్న పలువురు సీఐలు బదిలీ అయ్యారు. కర్నూలు రేంజ్ 4వ జోన్ పరిధిలోని కర్నూలు, నంద్యాల, వైఎస్సార్ జిల్లా, అన్నమయ్య జిల్లా, చిత్తూరు జిల్లాల్లో పనిచేస్తున్న 20 మంది సీఐలకు స్థాన చలనం కల్పించారు. వీఆర్‌లో ఉన్న ఐదుగురు సీఐలకు స్టేషన్ల బాధ్యతలు అప్పగిస్తూ శుక్రవారం రాత్రి కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలన సౌలభ్యం మేరకు ఈ బదిలీలు చేపట్టామని ఆయా జిల్లాల పరిధిలో ఎస్పీలు సీఐలను రిలీవ్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సీఐ	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
వి.శ్రీనివాసులు	సోషల్ మీడియా.సైబర్ క్రైం సెల్ (కర్నూలు)	ఎమ్మిగనూరుయూపీఎస్, కర్నూలు జిల్లా
ఎ.వేణుగోపాల్	వీఆర్, కర్నూలు	సోషల్ మీడియా, సైబర్ క్రైం సెల్, కర్నూలు
కె.ప్రవీణ్‌కుమార్	సీసీఎస్ – 2, కర్నూలు	బనగానపల్లె యూపీఎస్, నంద్యాల జిల్లా
ఎన్.కృష్ణయ్య	బనగానపల్లె యూపీఎస్, నంద్యాల జిల్లా	సీసీఎస్ – 3, నంద్యాల జిల్లా
ఎస్.మహమ్మద్ అలీ	వీఆర్, కడప	మన్నూరు యూపీఎస్, అన్నమయ్య జిల్లా
డి.రామాంజనేయులు	మన్నూరు యూపీఎస్, అన్నమయ్య జిల్లా	వీఆర్, అన్నమయ్య జిల్లా
బి.లక్ష్మన్న	ఉమెన్ పీఎస్, చిత్తూరు జిల్లా	మొలకలచెరువు సర్కిల్, అన్నమయ్య జిల్లా
పి.రాజరమేష్	మొలకలచెరువు సర్కిల్, అన్నమయ్య జిల్లా	ఎస్‌బీ–3, అన్నమయ్య జిల్లా
డి.మురళీధర్‌రెడ్డి	కర్నూలు త్రీటౌన్ పీఎస్, కర్నూలు జిల్లా	సీసీఎస్–2, కర్నూలు జిల్లా
పి.శేషయ్య	కర్నూలు వన్‌టౌన్ పీఎస్, కర్నూలు జిల్లా	కర్నూలు త్రీటౌన్ పీఎస్, కర్నూలు జిల్లా
పి.నాగశేఖర్	పీసీఆర్, ఆదోని, కర్నూలు జిల్లా	కర్నూలు వన్‌టౌన్ పీఎస్, కర్నూలు జిల్లా
ఎం.సోనక్క	వీఆర్, కర్నూలు	పీసీఆర్, ఆదోని, కర్నూలు జిల్లా
బి.వెంకటచలపతి	ఎస్‌బీ–3, అన్నమయ్య జిల్లా	ఆలూరు సర్కిల్, కర్నూలు జిల్లా
కె.శ్రీనివాస నాయక్	ఆలూరు సర్కిల్, కర్నూలు జిల్లా	వీఆర్, కర్నూలు
ఎ.మోహన్ కుమార్	డీసీఆర్‌బీ, అన్నమయ్య జిల్లా	ఉమెన్ పీఎస్–2, అన్నమయ్య జిల్లా
కె.ఎర్రిసావలి	డీఎస్‌బీ–2, నంద్యాల జిల్లా	మదనపల్లె వన్‌టౌన్ పీఎస్, అన్నమయ్య జిల్లా
ఎ.చాన్ బాషా	మదనపల్లె, వన్‌టౌన్ పీఎస్, అన్నమయ్య జిల్లా	వీఆర్, అన్నమయ్య జిల్లా
ఎ.సత్యనారాయణ	వీఆర్, అన్నమయ్య జిల్లా	డీఎస్‌బీ–2, అన్నమయ్య జిల్లా
జె.శంకరయ్య	డీఎస్‌బీ–2, అన్నమయ్య జిల్లా	డీసీఆర్‌బీ, అన్నమయ్య జిల్లా
జి.మారుతీ శంకర్	వీఆర్, కర్నూలు	సోషల్ మీడియా, సైబర్ క్రైం సెల్, నంద్యాల జిల్లా

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


జగన్ (ఫైల్)

కోడుమూరు రూరల్: ఆరుగాలం కష్టించి పంటలు పండించే రైతన్నకు నిత్యం కష్టాలే ఎదురువుతున్నాయి. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి కష్టించి పంటలు సాగు చేస్తే అతివృష్టి, అనావృష్టి రూపంలో నష్టాలు, మరోవైపు దిగుబడులకు గిట్టుబాటు ధర లభించక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. చివరకు అప్పులు తీర్చే మార్గం కానరాక.. ఆత్మాభిమానాన్ని చంపుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ కోవలోనే కోడుమూరు మండలం కల్లపరి గ్రామానికి చెందిన రైతు జగన్ (41)తనకున్న ఎకరా పొలంతో పాటు, మరో మూడెకరాలను కౌలుకు తీసుకొని పత్తి, కంది, ఉల్లి తదితర పంటలు సాగు చేస్తూ జీవనం సాగించేవాడు. గత నాలుగైదేళ్లుగా వ్యవసాయం కలిసి రాకపోవడం, అనారోగ్య సమస్యలు, కుటుంబ అవసరాల కోసం చేసిన అప్పులు రూ.15 లక్షలకు పైగా చేరాయి. ఈ నేపథ్యంలో ఇంటిని సైతం ఓ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో తాకట్టు పెట్టి రుణం తీసుకుని పంటలకు పెట్టుబడి పెట్టాడు. చివరకు అప్పులు తీర్చే మార్గం కానరాక గురువారం అర్ధరాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులంతా నిద్రపోయిన తర్వాత వంటగదిలోకి వెళ్లి కట్టుకున్న పంచెతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం తెలవారుజామున గమనించిన కుటుంబ సభ్యులు ఉరితాడు నుంచి కిందకు దించి కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య ఉరుకుందమ్మతో పాటు, ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం ఉన్నారు. పెద్ద దిక్కుగా ఉన్న వ్యక్తి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

గర్భిణికి చికిత్స చేయకుండా తిట్లదండకం


కర్నూలు(హాస్పిటల్): అర్ధరాత్రి కడుపునొప్పితో ఆస్పత్రికి వచ్చిన గర్భిణికి చికిత్స చేయకుండా కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ప్రసూతి విభాగం వైద్యురాలు ఒకరు నోటికొచ్చినట్లు దుర్భాషలాడినట్లు కుటుంబసభ్యులు ఆరోపించారు. ఘటనపై శుక్రవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. వివరాలు.. కర్నూలుకు చెందిన జి.లక్ష్మీకాంతమ్మ అనే ఐదు నెలల గర్భిణి తెల్లవారుజామున రెండు గంటల సమయంలో కడుపునొప్పితో ప్రభుత్వ ఆసుపత్రిలోని ప్రసూతి విభాగానికి వెళ్లింది. డ్యూటీలో ఉన్న మహిళా డాక్టర్ ఆమెను గంటసేపు కూర్చోబెట్టింది. తర్వాత నీ మొహం చూడటం కూడా ఇష్టం లేదని తిట్టడంతో అవమానంతో గర్భిణి బయటకు వచ్చింది. జరిగిన విషయాన్ని భర్తకు చెప్పడంతో ఈ సమయంలో ఎక్కడా వైద్యం చేయరని ఒప్పించి మళ్లీ లోపలికి పంపించారు. ఈసారి డాక్టర్ కడుపునొప్పి రావడానికి రాత్రి ఏమి గడ్డి తిన్నావు అనడంతో.. మేడం నేను మీతో ఘర్షణ పడేందుకు రాలేదు, దయచేసి చికిత్స అందించాలని గర్భిణి కోరారు. ఆగ్రహంతో ఊగిపోయిన వైద్యురాలు మాట్లాడితే చెంప పగులగొడతా అని బెదిరించింది. బాధతో బయటకు వచ్చిన గర్భిణి మహిళ వైద్యురాలు అయిఉండి తన పట్ల జాలి, దయ లేకుండా ప్రవర్తించినట్లు ఆవేదన వ్యక్తం చేసింది. ఆసుపత్రిలో ఇలాంటి ఘటనలు పునరావృతం గాకుండా చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు విచారణకు ఆదేశించారు. విచారణ కమిటీలో జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ ఎస్.లక్ష్మిబాయి, గైనకాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ ఎ.శ్రీలక్ష్మి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.హేమలతను నియమించారు.ఈ ఘటనను ప్రజాపరిరక్షణ సమి తి అధ్యక్షుడు కె.బలరామ్ తీవ్రంగా ఖండించారు.

బైక్‌లు దొంగిలించి జల్సాలు

- నలుగురి అరెస్ట్
- 25 బైక్‌లు స్వాధీనం

ఎర్రగుంట్ల: బైక్‌లను చోరీ చేసి విక్రయించగా వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తున్న నలుగురు యువకులు ఎట్టకేలకు పోలీసులకు చిక్కారు. వారి నుంచి రూ.25 లక్షల విలువైన 25 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పట్టణ సీఐ నరేష్‌బాబు వివరాలు వెల్లడించారు. నిందితులు ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, గుత్తి, గుంతకల్లు, డోన్, విజయవాడ, ధర్మవరం, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాల్లో రైల్వేస్టేషన్, బస్టాండ్, షాపింగ్ మాల్స్, హాస్పిటల్స్ తదితర పార్కింగ్ ప్రాంతాలలో నిలిపి ఉంచిన ఖరీదైన బైక్‌లను ఏడాది కాలంగా చోరీ చేసినట్లు చెప్పారు. బాధితుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు జిల్లా ఎస్పీ, జమ్మలమడుగు డీఎస్పీ ఆదేశాలతో విచారణ చేపట్టామన్నారు. ఎర్రగుంట్ల పట్టణం ప్రొద్దుటూరు రోడ్డులోని రామాంజనేయపురం క్రాస్ రోడ్డు వద్ద ఎస్ఐ నాగమురళి, సిబ్బందితో కలిసి నిందితులు మొలక గురివిరెడ్డి (నంద్యాల జిల్లా), షేక్ చిన్న హాజీబాషా (నంద్యాల జిల్లా), షేక్ ఇమాం హుస్సేన్ (అనంతపురం జిల్లా), బొడ్డుబోయిన నాగేష్ (నంద్యాల జిల్లా)లను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారి నుంచి రూ.25 లక్షల విలువైన 25 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్ విధించినట్లు తెలిపారు. కేసును ఛేదించిన సీఐ నరేష్‌బాబు, ఎస్ఐ నాగమురళి, ఏఎస్ఐ గురుశంకర్, కానిస్టేబుళ్లను జమ్మలమడుగు డీఎస్పీ అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఏర్పాట్లు పూర్తి


సి.బెళగల్ గురుకులంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న నిర్వాహకులు

సి.బెళగల్: మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో శనివారం నుంచి రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలు జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పూర్తి చేసినట్లు నిర్వాహకులు పరమేష్, సుంకరావు, పీడీ రాఘవేంద్ర తెలిపారు. ఈ మేరకు వారు శుక్రవారం పాఠశాల మైదానంలో కోర్టులను ఏర్పాటు చేసి, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారులకు అవసరమైన వసతులు, సౌకర్యాల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా 68వ రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా అండర్ – 17 బాలబాలికల పోటీలను సి.బెళగల్లో నిర్వహించడం జరుగుతుందని, పోటీలలో 11 జిల్లాలకు చెందిన 150 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి పోటీలు ప్రారంభం అవుతాయని చెప్పారు. పీడీలు శ్రీనివాసులు, రఫిక్, సత్యకుమార్, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

చంద్రబాబుకు గుణపాఠం తప్పదు

- సూపర్‌సిక్స్ పథకాలు వెంటనే అమలు చేయాలి
- సీపీఎం ప్రజాపోరు యాత్రలో నేతల డిమాండ్


పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): ప్రజలను మోసగించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు తగిన గుణపాఠం తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ హెచ్చరించారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు ప్రారంభమైంది. ఇందులో భాగంగా సీపీఎం నాయకులు గ్రామాలు, వార్డుల్లో పాదయాత్ర చేసి ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నారు. శుక్రవారం కర్నూలు ఒకటో వార్డు ఖండేరిలో పాదయాత్రలో గౌస్‌దేశాయ్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే కూటమి ప్రభుత్వం ప్రజలపై రూ.20 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపడం అన్యాయమన్నారు. ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పి ఇప్పుడు వేల కోట్ల భారాన్ని ప్రజలపై ఎలా మోపుతారని ప్రశ్నించారు. సూపర్ సిక్స్‌లో భాగంగా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతుంటే ప్రభుత్వం ఏమి చేస్తుందని ప్రశ్నించారు. అలాగే 23వ వార్డు శ్రీరామ్‌నగర్‌లో సీపీఎం వార్డు కార్యదర్శి కేవీ జనార్దన్‌రావు అధ్యక్షతన ప్రజాపోరు నిర్వహించారు. సీపీఎం నాయకులు పీఎస్ రాధాకృష్ణ, ఆర్.నరసింహులు పాల్గొన్నారు. ఈ నెల 14వ తేదీన కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ముట్టడి కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. అలాగే 36, 37 వార్డుల పరిధిలోని వీకర్ సెక్షన్ కాలనీలో సీపీఎం నాయకులు టి.రాముడు, అలివేలమ్మ, కె.అరుణ, కె.సుధాకరప్ప, కె. ప్రభాకర్ ప్రజాపోరులో భాగంగా పాదయాత్ర నిర్వహించారు. నగర కార్యదర్శి ఎస్ఎండీ షరీఫ్, మద్దిలేటి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కుట్రతో నీటి సరఫరాకు ఆటంకం


కొలిమిగుండ్లలో స్టార్టర్ బాక్స్‌కు వేసిన తాళాన్ని తొలగిస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: కూటమి నాయకుల దుశ్చర్యతో కొలిమిగుండ్లలో శుక్రవారం సాయంత్రం వరకు పలు కాలనీలకు నీటి సరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం ఉన్న వాటర్‌మెన్‌ను తొలగించి తమ వారిని నియమించుకోవాలనే ఉద్దేశంతో టీడీపీ నాయకులు ఏకంగా స్టార్టర్ బాక్స్‌లకు తాళాలు వేయడం శోచనీయం. ఈ ఘటనపై సర్పంచ్ శివరాముడు పోలీసుల దృష్టికి తీసుకెళ్లి టీడీపీ నాయకులు వేసిన తాళాలను పగులగొట్టి యథావిధిగా తాగునీటి సరఫరా చేశారు. టీడీపీ నేతలు నాయకులు స్వార్థంతో వాటర్‌మెన్‌ను తొలగించేందుకు కుట్రలు పన్నుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గొంతు కోసుకొని మహిళ ఆత్మహత్యాయత్నం


ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న పార్వతి

ఎమ్మిగనూరురూరల్: జీవితంపై విరక్తి చెందిన మహిళ కత్తితో గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం గుడేకల్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన బోయ ఆంజనేయులు, పార్వతి దంపతులకు ఇద్దరు కుమారులు. పార్వతి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఎన్నిచోట్ల చూయించినా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూలేని సమయంలో కత్తితో గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. నొప్పి తట్టుకోలేక కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు ఇంటికి చేరుకుని వెంటనే చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

పెద్దాసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స


కోలుకున్న రవితో వైద్యబృందం

కర్నూలు(హాస్పిటల్): ఓ వ్యక్తికి కాలేయంలో కణితి ఏర్పడింది. అతనికి కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వైద్యులు అరుదైన శస్త్రచికిత్స ద్వారా కణితి తొలగించి పునర్జన్మ ప్రసాదించారు. వివరాలను శుక్రవారం జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ మాధవీశ్యామల వివరించారు. నంద్యాల జిల్లా పాణ్యం మండలం గగ్గటూరుకు చెందిన కె.రవి (35) ఏడాది కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఎంతకూ తగ్గకపోవడంతో గత నెల 4న కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల జనరల్ సర్జరీ విభాగంలో చేరాడు. అతనికి అన్ని రకాల పరీక్షలు చేసిన వైద్యులు కాలేయంలో మ్యూసినస్ సిస్ట్ స్టడినోమా అనే అరుదైన కణితి ఉన్నట్లు గుర్తించారు. 16వ తేదీన ఆపరేషన్ చేసి కొంత కాలేయంతో పాటు కణితిని తొలగించారు. క్రమంగా అతడు కోలుకోవడంతో ఈ నెల 2వ తేదీన డిశ్చార్జ్ చేశారు. రివ్యూ కోసం శుక్రవారం ఆసుపత్రికి రాగా స్కానింగ్ చేసి ఎలాంటి సమస్య లేదని నిర్ధారణకు వచ్చారు. ఆపరేషన్ చేసిన వారిలో సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ సురేష్‌కుమార్‌రెడ్డి, డాక్టర్లు చంద్రారెడ్డి, శృతి, కొండారెడ్డి, రాణిమంజూష, సంజీవ్ పాల్గొన్నారు. ఆస్పత్రిలో అత్యాధునిక వైద్య పరికరాలు ఉండటంతో ఇలాంటి అరుదైన, క్లిష్టమైన ఆపరేషన్ చేయగలిగామని డాక్టర్ మాధవీశ్యామల వివరించారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేశామని, ప్రైవేటులో అయితే రూ.20 లక్షల దాకా ఖర్చవుతుందని చెప్పారు.